క్లుప్తంగా

బకాయి వేతనాలు మంజూరు చేయండి

నర్వ: ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేందర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా రోజు కూలీ కనీసం రూ.600 ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచాలన్నారు. పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేసి, గడ్డపార, ఇతర పరికరాలు ఇవ్వాలన్నారు. పై సమస్యల సాధన కోసం ఈ నెల 30న నిర్వహించే చలో కలెక్టరేట్, ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూలీలను కోరారు.

ఘనంగా వీర సావర్కార్ జయంతి



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ దగ్గర బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కార్ 142వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ, వీహెచ్‌పీ, తపస్, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ డీకే అరుణ కూడా వీర సవర్కార్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు.

మొక్కల పంపిణీకి చర్యలు



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలోని నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసారి కాస్త ముందుగానే వర్షాలు కురుస్తుండడంతో మొక్కల పంపిణీకి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఇది వరకు రోడ్డు పక్కన మొక్కల్లో కొన్ని ఎండిపోయాయని వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటుతామన్నారు. ప్రస్తుతం నర్సరీలో గులాబీ, కానుగ, గుల్మోర, టేకోమా, శిసువు, దానిమ్మ, మొక్కలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకలు

నారాయణపేట రూరల్, ధన్వాడ: టీడీపీ వ్యవస్థాపకులు, ఉమ్మడి రాష్ట్రం మాజీ సీఎం దివంగత నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని బుధవారం ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

నర్వ: ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం నర్వలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నేతలు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అమరచింత: నకిలీ పత్తి విత్తనాలను అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏఓ అరవింద్, ఎస్ఐ సురేష్ వ్యాపారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం పంటల సాగు మొదలవ్వడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సదరు షాపుల యాజమానులకు సూచించారు. అలాగే కాలం చెల్లిన రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు రైతులకు కట్టబడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

అమరచింత: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరు బాధితులకు వారి ఫోన్‌లను తిరిగి ఇచ్చినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. కొన్ని రోజుల కిందట పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో సీఈఐఆర్ పోర్టర్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

మిడ్జిల్: మండల కేంద్రంలో ఎంపీ నిధులతో నిర్మించనున్న మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. పేదలకు ప్యూరిఫైడ్ వాటర్ అందించేందుకు వాటర్ ప్లాంట్ మంజూరు చేసిన ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, నాయకులు శ్రీనువాస్‌రెడ్డి, గౌస్, వెంకటయ్య, బాల్‌రెడ్డి, రాజేశ్వర్, తిరుపతి, నరేష్‌నాయక్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, భీమయ్య, మల్లయ్య, శేఖర్ పాల్గొన్నారు.

సాయం స్వల్పం.. పెట్టుబడులు భారం



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

- ఏటేటా పెరుగుతున్న సాగు ఖర్చులు
- ట్రాక్టర్, నాగళ్ల కిరాయిల పెంపు
- కూలీల రేట్లు సైతం రెట్టింపు

మరికల్: వానాకాలం ప్రారంభం కానుండడంతో అన్నదాతలు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు రైతన్నలకు భారంగా మారాయి. ట్రాక్టర్లు, యంత్రాలు, కూలీల ఖర్చులు, ఎరువులు ధరలు అమాంతంగా పెరగడంతో పెట్టుబడులు రైతుల నెత్తిన తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరాకు కొంత పెట్టుబడి సాయం అందజేస్తున్నా అవి ఏ మూలకు సరిపోవడం లేదని గతేడాది కంటే ఎకరాకు ఈ ఏడాది రూ.10 వేల వరకు అదనపు భారం పడుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికల్ మండలంలో పెద్దఎత్తున ప త్తి, వరి పంట లను సాగు చేస్తున్నారు. కోయిల్‌సాగర్ ఆయ కట్టు కింద మాత్రమే ప్ర తి ఏడాది 6 నుంచి 8 వేల ఎకరాల వర కు వరి సాగు చేపడతారు. మిగితా మండలాల్లో పత్తితో పాటు కంది, అముధం, జొన్న పంటలపై ఆధారపడుతున్నారు. అయితే పెట్టుబడులు భారంగా మారడంతో కర్షకులు దిక్కు తోచని పరిస్థితిలో పడ్డారు.

ఎరువుల రకం	పాత ధర	కొత్త ధర
డీఏపీ	రూ.1250	రూ.1600
20-20-0-13	రూ.950	రూ.1200
28-28-0	రూ.1275	రూ.1500
పొటాష్	రూ.850	రూ.1200
14-35-14	రూ.1275	రూ.1480
16-20-0-13	రూ.1000	రూ.1250



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

ఎకరాకు రూ.40 వేల వ్యయం

పత్తి సాగు పెట్టుబడికి ఖర్చులు ఏటా పెరుగుతుపోతున్నాయి. గత వానాకాలంతో పోలిస్తే ఈ సారి ఎకరాకు రూ.10 వేల వరకు అదనంగా వ్యయం అవుతుందని అంచనా. డీజిల్ ధరల కారణంగా దున్నకం ఖర్చులపై ప్రభావం పడింది. గత వానాకాలంలో ట్రాక్టర్ కిరాయి గంటకు రూ.800 ఉంటే ఈ ఎడాది గంటకు రూ.1000 తీసుకుంటున్నారు. వరి సాగుకు వస్తే ప్రస్తుతం కర్రిగేట చేసే ట్రాక్టర్‌కు గంటకు రూ. 1500 డిమాండ్ చేస్తున్నారు. గతేడాది పత్తికి ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలు వస్తే ఈ ఎడాది రూ.40 నుంచి వచ్చే అవకాశం ఉంది. కూలీల కొరత ఏర్పడితే ఇతర గ్రామాల నుంచి వచ్చే కూలీలకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

అప్పులు తడిసి మోపెడు



సాగు వ్యయం పెరగడంతో లాభాల మాటా దేవుడెరుగు.. అప్పులు తడిసి మోపెడు అవుతున్నాయి. గత వానాకాలంతో పోలిస్తే ఇప్పుడు ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు భారం పడుతుంది. దున్నుట, కలుపు తీయుట, ఖర్చులు కూడా భారీగా పెరిగిపోయాయి. కానీ పండించిన పంటలకు మద్దతు ధర మాత్రం లభించడం లేదు.

– అంజనేయులు, రైతు, మరికల్

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి



పెట్టుబడులు పెరుగుతున్న కారణంగా ప్రభుత్వం కూడా పంటలకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి. పత్తి క్వింటాల్‌కు రూ.10 వేలు, వరికి క్వింటాల్ రూ.3 వేలు, కందికి క్వింటాల్‌కు రూ.12 వేలు ప్రకటిస్తే నష్టాల నుంచి గట్టేక్కే అవకాశం ఉంటుంది. మద్దతు ధరలు లేకుంటే నష్టాలను చావి చూడాల్సిందే.

– వెంకటయ్య, రైతు, బూద్యగాని తాండ

పెట్టుబడి ఖర్చులు ఇలా..

పనులు	గతేడాది	ప్రస్తుతం
కరిగెట చేయుటకు (గంటకు)	రూ.1200	రూ.1500
గొర్రుకు	రూ.1500	రూ.2000
పొలాలు దున్నుటకు (గంటకు)	రూ.800	రూ.1000
వరినాటు కూలీలకు (ఎకరాకు)	రూ.4500	రూ.5000
పత్తి విత్తనాల ఖర్చు (ఎకరాకు)	రూ.30,000	రూ.40,000

పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

కొత్తపల్లి: రాష్ట్రంలో పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మండలంలోని భూనీడు గ్రామ పంచాయతీలో బుధవారం గృహ నిర్మాణ శాఖ డీఈ హరికృష్ణతో కలిసి నిర్మాణం చేపట్టిన ఇళ్లకు మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 60 గజాల్లో ఇంటిని నిర్మించుకోవాలన్నారు. అర్హులందరికీ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మద్దూరు ఎంపీడీఓ నర్సింహ రెడ్డి, హౌసింగ్ ఏఈ శాంతకుమార్, నాయకులు పాల్గొన్నారు.



బూనీడులో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేస్తున్న అధికారులు

అయ్యప్ప ప్రీమియర్ లీగ్ ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో 'అయ్యప్ప ప్రీమియర్ లీగ్' (ఏపీఎల్) బుధవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ముందుగా అయ్యప్పస్వామి పూజ, హనుమాన్ చాలీసా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడాజట్లు తమ ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో దీక్ష ప్రచార సమితి సభ్యులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఫలితాలు

అయ్యప్ప ప్రీమియర్ లీగ్‌లో కార్పొరేషన్ పరిధిలో అయ్యప్ప మాలధారులు, భక్తులతో 32 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి రోజు ఏడు మ్యాచ్‌లు ఆడగా అనిల్ లెవన్, యాదయ్య లెవన్, వీపీటీ లెవన్, రాహుల్ వీపీటీ, స్వర్ణకార్ లెవన్, డీజీ బాయ్స్, పంచముఖి లెవన్ జట్లు విజయం నమోదు చేసుకున్నాయి. ఈనెల 30వరకు అయ్యప్ప ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్

'నిరుపేదలకు అండగా ఉంటా'

కోయిల్‌కొండ: నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. వింజామూర్ గ్రామానికి చెందిన గద్వాల కొండప్ప క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే చికిత్స సమయంలో బాధితుడు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.30వేల ఎల్‌ఓసీ మంజూరు కాగా ఎమ్మెల్యే బుధవారం కొండప్ప కుమారుడు రామకృష్ణకు ఎల్‌ఓసీ అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

మాగనూర్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ రహ్మతుద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాంరెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లోని లబ్ధిదారులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం

మక్తల్: ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇంట్లో సౌభాగ్యం ఉంటుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్‌లోని తహసీల్దార్ కార్యాయంలో లబ్ధిదారులకు షాది మూబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. ఏడు మండలాల్లో 2122 మందికి రూ.1.22 కోట్లు మంజూరు కాగా వాటిని పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్న పేదోడికి మాత్రం న్యాయం చేస్తామన్నారు.

48 మందికి చెక్కుల పంపిణీ

కృష్ణా: నియోజకవర్గంలోని ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆదుకునేందుకు తాను సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 48 మందికి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరిపిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి

నారాయణపేట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరగకుండా 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు పోవాలని కోరారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేద విద్యా ర్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ధన్వాడ: మండల కేంద్రంలోని సంతబజార్ ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పాల్గొని భూమి పూజ చేశారు. హిందు వాహిని జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు, మాకం సురేందర్, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాఘవరెడ్డి, వేణు, శ్రీనివాసులు గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని పాలమూర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. టీజేఎఫ్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్, పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం ఫర్ణికర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మత్స్యశాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్, ఆర్డీఓ పోషల్ రాజేష్‌లతో కలిసి వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టులు స్వరాష్ట్ర సాధనకు పిడికిలి బిగించి పోరాటం చేశారన్నారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పాటై 25 ఏళ్ల పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకుంటున్న జర్నలిస్టుందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాధనలో, సమాజాభివృద్ధిలో ప్రజా సంక్షేమంలో ముందుండే జర్నలిస్టుందరికీ తమ సహయ సహకారాలు ఎల్లవేళల ఉంటాయన్నారు.

బ్లాక్ ఫిల్మ్ వాడితే కఠిన చర్యలు

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు పట్టణంలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బ్లాక్ ఫిల్మ్ ఏర్పాటు చేసుకున్న వాహనాలపై ఆపి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో కార్లకు బ్లాక్ ఫిల్మ్ వాడుతున్న వాటిని గుర్తించి జరిమానా విధించడంతో పాటు వాటిని తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మోటారు వాహనచట్టం ప్రకారం కార్లకు బ్లాక్ ఫిల్మ్ వేయడం నేరమని, బ్లాక్ ఫిల్మ్ ముసుగులో అనేక నేరాలు జరుగుతున్నట్లు తెలిపారు. కారు యాజమానులు ఎవరూ నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వాడరాదని, ఒకవేళ వాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న సీఐ

దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన

నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో బుధవారం నూతన దేవాలయ ప్రారంభం, నూతన దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభించారు. గ్రామంలో వేదమంత్రాలతో మార్మోగింది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో హోమం, అగ్నిస్థాపన నిర్వహించారు. గురువారం జల, ధాన్య దివాసాలు చేసి శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారు. కార్యక్రమంలో నిర్వాహకులు బోజయ్య, రవి, నారాయణ, సురేష్, గోపాల్, యాదగిరి, సంతోష్, నర్సింహగౌడ్, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



అధ్వానంగా అంతర్గత రోడ్లు



వడ్వాట్‌లోని ఓ కాలనీలో రోడ్డు దుస్థితి

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో ప్రధాన రహదారితో పాటు పలు అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలకు సీసీ రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు, బురదతో నిండిన రోడ్లపై ఇంకెన్ని రోజులు తిరగాలని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంకు

మరికల్: మండల కేంద్రానికి తాగునీరు సరఫరా చేసే మంచినీటి అపరిశుభ్రంగా తయారైంది. ఇళ్ల నుంచి చెత్త చెదారం తెచ్చి ట్యాంకు దగ్గర పడేస్తుండడంతో చుట్టుపక్కల మొత్తం అపరిశుభ్రత నెలకొంది. అలాగే ట్యాంకు దగ్గర ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. ట్యాంకులో చెత్తాచెదారం పడి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని అధికారులు స్పందించి ట్యాంకు చుట్టు పిచ్చిమొక్కలను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మంచినీటి ట్యాంకు చుట్టు పెరిగిన పిచ్చిమొక్కలు

వన మహోత్సవానికి అంతా సిద్ధం

- అన్ని గ్రామాల్లో నర్సరీల నిర్వహణ
- 1.40 లక్షల మొక్కల పెంపకం పూర్తి

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధమవుతున్నాయి. మరో పక్షం రోజుల్లో చేపట్టే వన మహోత్సవానికి వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 30 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నర్సరీల నిర్వహణకు గ్రామ పంచాయతీలు పెద్దపీట వేస్తున్నాయి. ఈ నర్సరీల సంరక్షణను వన సేవకులు చూసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 30 నర్సరీల పరిధిలో 1.40 లక్షల మొక్కల పెంపకానికి లక్ష్యం నిర్ధేశించగా అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే ఉల్లిగుండం గ్రామంలో ఫారెస్ట్ శాఖ ద్వారా 40వేల మొక్కలతో ఓ నర్సరీని సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ పెంచిన మొక్కల్లో ఈ ఏడాది వన మహోత్సవంలో ఈజీఎస్ ద్వారా 93 వేల మొక్కలను నాటేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు.

మొక్కలు నాటేందుకు చర్యలు

నర్సరీల్లో ఈ ఏడాది టేకు మొక్కల పెంపకం లేకపోగా పండ్ల, పూల మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. ముఖ్యంగా మందార గులాబీ, గన్నేరు, భోగన్‌విలియ, మల్లె మొక్కలతో పాటు జామ నిమ్మ, దానిమ్మ చింత, ఖర్జూర్, కానుగ, మునగ, రేన్‌ట్రీ మొక్కలను పెంచుతున్నారు. ఆయా మొక్కలను ఆసక్తి గల రైతులు బండ్ ప్లాంటేషన్ ద్వారా పొలాల గట్లు, చెరువు గట్లపై నాటుకోవచ్చు. ఇక రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల ఆవరణల్లో ఇన్‌స్ట్యూషనల్, కమ్యునిటీ తదితర ప్రాంతాల్లో మొక్కలను నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



అన్నసాగర్ నర్సరీలో పెంచిన మొక్కలు



ఉల్లిగుండంలో ఫారెస్ట్ శాఖ నర్సరీ

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మొక్కలను పెంచుతున్నాం. వనహోత్సవ కార్యక్రమానికి క్యాటగిరీల వారీగా మొక్కలు నాటేందుకు కమ్యునిటీ, ఏవెన్యూ, బండప్లాంటేషన్ ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం.త్వరలోనే మొ క్కలు నాటేందుకు పాదులు తీసే పనులు చేపడతాం.

–జయమ్మ, ఏపీఓ, ఎస్ఆర్ఈజీఎస్, దామరగిద్ద